నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
సోమవారం | 23 సెప్టెంబరు 2024 పేజీలు 8

కర్నూలులో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి

# నిమ్మల రామానాయుడు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:**

హంద్రీనీవా ప్రాజెక్టు పనుల పరిశీలనలో భాగంగా కర్నూలు జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నగరంలో స్టేట్ గెస్ట్‌హౌస్‌కు వచ్చారు. ఆయనకు పోలీసులు గౌరవ వందనం ఇచ్చారు. అనంతరం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష, మిగతా 2లో


మంత్రి నిమ్మల రామానాయుడుతో జిల్లా నాయకులు, అధికారులు

త్వరలో కర్నూలులో

# హైకోర్టు బెంచ్ ఏర్పాటు

- ప్రభుత్వ వంద రోజుల పాలనను ప్రజలు మెచ్చుకుంటున్నారు
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ.భరత్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ .భరత్


ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికిస్తున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని 47వార్డు ధర్మపేట, 13వవార్డు బంగారుపేటలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి.రంజిత్‌బాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబునాయుడు గాడిలో పెడుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు విజనరీతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశలో ముందుకు వెళ్తున్నారన్నారు. ప్రభుత్వ వందరోజుల పాలనను ప్రజలు మెచ్చుకుంటున్నారన్నారు. ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంపు, డీఎస్సీ ప్రకటన, పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. రానున్న ఐదేళ్లలో అక్కడ మౌలిక మిగతా 2లో

- జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- ప్రాజెక్టుల నిర్వహణ గాలికి వదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- రాయలసీమ బిడ్డనని చెప్పుకున్న జగన్ రాయలసీమకు చేసింది ఏమీ లేదు
- నెలలో 15 రోజులు రాయలసీమలోనే గడుపుతా..



**నందికొట్కూర్ మేజర్ న్యూస్ :** హంద్రీనీవా సామర్థ్యాన్ని వచ్చే ఏడాది రెండింతలు పెంచుతామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలోని మల్యాల ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ,నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, పత్తికొండ ఎమ్మెల్యే కేయి. శ్యాంబాబుతో కలసి సందర్శించారు. ఉదయం 10 గంటలకు మల్యాలకు చేరుకున్న ఆయన మిగతా 2లో

హంద్రీనీవా సామర్థ్యాన్ని

# రెట్టింపు చేస్తాం..


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల


గంగమ్మకు పూజ చేసి, పసుపు కుంకుమ, చీర సమర్పిస్తున్న మంత్రి నిమ్మల


తూతూ మంత్రంగా తాడు సాయంతో కంచె ఏర్పాటు చేసిన ఇరిగేషన్ అధికారులు

ప్రమాదాలకు నిలయంగా

# పికప్ ఆనకట్ట

- గతంలో యువకులు నీటి ప్రవాహంలో గల్లంతు
- రక్షణ చర్యలు చేపట్టని అధికారులు
- సంతజూటూరు పికప్ ఆనకట్ట వద్ద ఉధృతంగా వరద ప్రవాహం


2లో
ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

# ప్రభుత్వ కార్యాలయాలు



2లో
రైతు భరోసా కేంద్రం నందు తాగి ఉంచిన వ్యర్థాలు(ఇన్‌సెట్‌లో)

# ప్రమాదాలకు నిలయంగా పికప్ ఆనకట్ట



అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్న అప్పటిజిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ (ఫైల్‌ఫోటో)



కెసి కెనల్ గేట్లను పరిశీలిస్తున్న గత కలెక్టర్ (ఫైల్‌ఫోటో )

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సంతజూటూరు గ్రామం వద్ద ఉన్న పిక ప్ ఆనకట్ట ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రతి ఏడాది ఇక్కడికి వచ్చిన ప్రజలు వాగు ప్రవాహంలో గల్లంతై మృతి చెందుతున్నారు. అయినప్పటికి కెసి కెనాల్ అధికారులు, పోలీసులు ఇక్కడ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే ... పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కృష్ణ జలాలు సంతజూటూరు పికప్ ఆకనట్ట వద్దకు చేరుతాయి. దాదాపు 30 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతుంది. ఇక్కడి నుంచి కెసి కెనాల్‌కు 2 వేల క్యూసెక్కులు , కుందూనదికి 25వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కుందూనది ద్వారా వెళ్ళె వరద నీరు పెన్నా నదిలో కలసి నెల్లూరు జిల్లాలోని సోమశిల, కండలేరు ప్రాజెక్టులకు చేరుతుంది. దీంతో ఇక్కడ వరద ప్రవాహం ఎక్కువగా ఉంటుంది.

**పర్యాటకులను ఆకర్షిస్తున్న పికప్ ఆనకట్ట :** పికప్ ఆనకట్ట వద్ద ఉన్న చెట్లు ఇటు పర్యాటకులను, అటు ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ పికప్ ఆనకట్ట వద్ద నీటి ప్రవాహం చూడటానికి నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వస్తుంటారు. ఈ క్రమంలో సరదాగా నీళ్ళలో ఈత కొట్టేందుకు ప్రయత్నం చేస్తుంటారు. ఈ క్రమంలో నీటి ప్రవాహంలో గల్లంతై పలువురు మృత్యువాత పడుతున్నారు. దీంతో అధికారులు ఇక్కడ ప్రమాదాలను అరికట్టడానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు :** పికప్ ఆనకట్ట వద్ద ప్రతి ఏడాది ప్రమాదాలు జరుగుతున్నా వాటిని అరికట్టే చర్యలు ఏ మాత్రం తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రతి ఆదివారం పండుగల తర్వాత రోజుల్లో పెద్ద ఎత్తున జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి ప్రజలు తరలి వచ్చి విందు భోజనాలు చేస్తుంటారు. ఆ తర్వాత కుందూనదిలో దిగి ఈత కొట్టే ప్రయత్నం చేయడం సర్వసాధారణంగా జరుగుతుంది. దీంతో ప్రజలు కుందూనదిలోకి దిగకుండా ఎటువంటి అడ్డుకట్టలు వేయడం కానీ, ప్రమాద సూచికలు తెలిపే బోర్డులు కానీ ఏర్పాటు చేయలేదు. అక్కడికి వచ్చిన ప్రజలు ప్రవాహం లోతు తెలుసుకోకుండా నదిలోకి దిగి యువకులు, ప్రజలు మృత్యువాత పడుతున్నారు. గతంలో ఇక్కడ యువకులు గల్లంతు కావడంతో అప్పటి నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ స్వయంగా పిక ప్ ఆనకట్ట వద్దకు వచ్చి అక్కడి పరిస్థితులను గురించి ఆరా తీశారు. పికప్ ఆనకట్ట వద్ద కుందూనదిలోకి దిగకుండా పైభాగంలో తూముల వద్దకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఈ ఏడాది కూడా పికప్ ఆనకట్ట వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు ఆందోళ న చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పికప్ ఆనకట్ట వద్ద ప్రమాదాలు జరుగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ప్రభుత్వ కార్యాలయాలు

**విచ్చలవిడిగా మందుబాబుల ఆగడాలు**
**ప్రాంగణంలోనే మద్యంతో విందులు**
**కార్యాలయాల ముందే తాగి పడేస్తున్న వ్యర్థాలు**
**పట్టించుకోని సంబంధిత అధికారులు**



ప్రాంగణంలో తాగి పడేసిన మద్యం వ్యర్థాలు

**దేవనకొండ ,మేజర్ న్యూస్ :** మందు బాబుల వికృత చేష్టలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి.ఇంట్లో తల్లిదండ్రుల భయం ఎలాగూ లేకపోయె కనీసం జనాలకన్నా భయపడాలనే సామెతను కూడ మరచిన మందు బాబులు వారికి నిత్యం మద్యం సేవించడాకిని ఏకంగా ప్రభుత్వం కార్యాలయాలనే అడ్డాగా చేసుకున్నారు.దేవనకొండ మండల కేంద్రంలో తహశీల్దార్,ప్రజా పరిషత్,రైతు భరోసా,వ్యవసాయాధికారి, ప్రభుత్వం వైద్యశాల,పశు వైద్యశాల,ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుతో పాటు జిల్లా పరిషత్ పాఠశాల సైతం ఒకే ప్రాంగణంలో ఉండటం ప్రజలకు మాత్రం శుభపరిణామం అయితే ఆయా శాఖల అధికారుల అలసత్వం కారణంగా అక్కడ పరిస్థితులు అదుపు తప్పుతున్నాయి. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు ఆకతాయిలు,అల్లరి మూకలు పట్ట పగలే కార్యాలయాల సమయంలో కూడ ఆయా ప్రభుత్వం కార్యాలయాల ప్రాంగణంలో కూర్చుని మద్యంతో పాటు విందులు చేసుకోవడం పరిపాటిగా మారింది.మద్యం సేవించి వారు తాగిన మద్యం సీసాలు,వాటర్ పాకెట్లు తినుబండారాల వ్యర్థాలను కార్యాలయాల ముందే వదిలేసి వెళ్తున్నారు.అయితే ఉదయం కార్యాలయాలకు వచ్చిన సిబ్బంది తమ కార్యాలయాల దగ్గర మందు బాబుల వదిలేసిన వ్యర్థాలను తీసేసి తమ పనులు యధావిదిగా కొనసాగిస్తున్నారు.ఈ విషయం గురించి కొందరు నాయకులు,అధికారులకు తెలిసినప్పటికీ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తూ పట్టించుకోకపోవడం గమనార్హం.

**అధికారులు చర్యలు తీసుకోవాలి: తపాలా శ్రీనివాసులునాయుడు :** కొందరు ఆకతాయిలు,అల్లరి మూకలు మద్యానికి బానిసై జులాయిగా తిరగుతూ ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవించడమే కాక నిత్యం ప్రభుత్వం కార్యాలయాల ప్రాంగణంలో కూడ మద్యం సేవించి వికృత చేష్టలకు పాలపడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ దేవనకొండ యంపిటిసి సభ్యులు తపాలా శ్రీనివాసులు నాయుడు అన్నారు.ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండటంతో మండలంలోని గ్రామాల నుండి చాలా మంది మహిళలు సైతం కార్యాలయాలకు వస్తుంటారు.అయితే ఏ ప్రభుత్వ కార్యాలయాల నందు చూసినా ముందుగా తాగి పడేసిన మద్యం సీసాలు,వాటర్ పాకెట్లు,ధూమపానం,వంటి వ్యర్థాల నుండి ఇబ్బందులకు గురవుతున్నారు.కాబట్టి అందుకు కారణమైన వారిని గుర్తించి అధికారులు పోలీసులకు పిర్యాదు చేయాలన్నారు.అంతే కాకుండా పోలీసులు కూడ పగలు మరియు రాత్రి సమయంలో ప్రభుత్వం కార్యాలయాల నందు పహారా చేయాలని కార్యాలయ సమయంలో కాకుండా రాత్రి సమయంలో ప్రభుత్వం కారార్యలయాల ప్రదేశంలో ఉన్న ఆకతాయిలను అదుపులోకి తీసుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



తపాలా శ్రీనివాసులు నాయుడు

## పర్యాటక రంగంపై వక్తృత్వ క్విజ్ పోటీలు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**

ఈనెల27వ తేదీ ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల, పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ డ్రాయింగ్, పెయింటింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల టూరిజం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో విద్యార్థులు విరివిగా పాల్గొనాలన్నారు. పర్యాటకం, శాంతి అనే అంశం వక్తృత్వ పోటీ, ప్రముఖ పర్యాటక ప్రదేశాలపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించబడతాయన్నారు. ప్రపంచ, భారత్, ఆంధ్రప్రదేశ్ టూరిజంపైన క్విజ్ నిర్వహించడంతో పాటు విద్యార్థులు, యువకులకు ఒక నిమిషం గల వీడియో, అలాగే జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలు పర్యాటకులకు తెలియజేస్తూ ఆకట్టుకొనే 15 నుంచి 20సెకండ్ల నిడివితో గల రీల్స్, వీడియోలు రూపొందించి సమర్పించాల్సి ఉంటుందన్నారు. వీటిలో ఉత్తమంగా ఎంపికైన వాటికి 27వ తేదీన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈనెల 26వ తేదీ నాటికి టూరిజం వీడియో, రీల్స్ సమర్పించాల్సి ఉంటుందని జిల్లా పర్యాటక అధికారి తెలిపారు. ఇతర వివరాలకు 7995087089, 8297098022లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

## కర్నూలులో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

(మొదటి పేజి తరువాయి)



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న దృశ్యం

పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, కోడుమూర ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

# హంద్రీనీవా సామర్థ్యాన్ని రేటింపు చేస్తాం..

(మొదటి పేజి తరువాయి)

మల్యాల ఎత్తిపోతల పథకంలోని పంపింగ్ స్టేషన్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంగమ్మకు పూజ చేసి, పసుపు కుంకుమ, చీర సమర్పించారు. ఈ సందర్భంగా ఎర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్ట్‌ల నిర్వహణను గాలికి వదిలేసిందని ఎక్కడ తట్ట మట్టి కూడా తియ్యలేదని ఎద్దేవా చేసారు. నెలలో 15 రోజులు రాయలసీమలోని ప్రాజెక్టులను సందర్శించి ఈ ప్రాంతంలో సాగు, తాగునీటికి కొరత లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.రాయలసీమ బిడ్డనని చెప్పుకొనే మాజీ సీఎం జగన్ రాయలసీమ ద్రోహి అని విమర్శించారు.అప్పటి టిడిపి ప్రభుత్వంలో బడ్జెట్‌లో ప్రాజెక్టుల నిర్వహణ కొరకు 9% నిధులు కేటాయిస్తే, వైసీపీ ప్రభుత్వంలో కేవలం 4% మాత్రమే కేటాయింపు చేసారని ,అందులో కొంతమేర మాత్రమే ప్రాజెక్టులకు ఖర్చు చేశారని, మిగతా నిధులను అవినీతికి పాల్పడి కాజేశారని మండిపడ్డారు. మొత్తం 12 పంపుల ద్వారా దాదాపు నాలుగు వేల క్యూసెక్కుల నీటిని తీసుకుపోయే అవకాశం ఉన్న కాలవ సామర్థ్యం లేకపోవడంతో కేవలం 2000 క్యూసెక్కుల నీటిని మాత్రమే తరలించే అవకాశం ఉందని అన్నారు.మన ప్రభుత్వం నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని అందుకే వచ్చే సీజన్ కల్లా హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి నాలుగు వేల క్యూసెక్కుల నీటిని సాగునీటి ప్రాజెక్టులకు అందించే బాధ్యత తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రికి స్థానిక ఎమ్మెల్యే గిత్త జయసూర్య వినతుల ద్వారా నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. మిడుతూరు మండలానికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తాగు ,సాగు నీటిని అందించాలని కోరారు. అలాగే అలగనూరు రిజర్వాయర్ పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. మండ్లెం రైతులకు సాగు నీరు అందివ్వాలని ఎమ్మెల్యే మంత్రికి విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే జయ సూర్య కోరిన అన్ని కోర్కెలకు తీరుస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

# త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

(మొదటి పేజి తరువాయి)

సదుపాయాలు కల్పించి పరిశ్రమలు తీసుకవస్తామన్నారు. కర్నూలు నగరంలోని సమస్యలను పరిష్కరించి నగర రూపురేఖలు మారుస్తామన్నారు. ఎంతో పవిత్రమైన తిరుమల లడ్డు తయారీలో గతంలో కల్తీ జరగడం బాధకరమన్నారు. అనంతరం అధికారులతో కలిసి వార్డుల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, నాగేశ్వరరావుయాదవ్, నాగరాజుయాదవ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జల వనరుల శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే కెఈ

**పత్తికొండ టౌన్, మేజర్ న్యూస్ :** కర్నూలు స్టేట్ గెస్ట్‌హౌస్‌లో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడును పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ శ్యామ్ కుమార్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, పత్తికొండ నియోజకవర్గం కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమని, నిత్యం కరువు కాటకాలతో వెనుకబడ్డ నియోజకవర్గాన్ని హంద్రీనీవా జలాలతో సస్యశ్యామలం చేయాలని జలవనరుల శాఖ మంత్రిని కోరారు. హంద్రీనీవా కాల్వ 80కి.మీ., మేర పారు తోందని, పత్తికొండ, వెల్దుర్తి, కృష్ణగిరి, మద్దికెర, తుగ్గలి మండలాల్లో హంద్రీనీవా కాల్వ నీటిని గ్రావీటి ద్వారా రైతుల పొలాలకు ఇచ్చేందుకు ప్రణాళికలను రూపొందించామని, వాటిని మం జూరు చేయాలన్నారు. అన్ని చెరువులకు నీళ్లు ఇచ్చేందుకు నిధులు మంజూరు చేసి పత్తికొండ నియోజకవర్గ రైతులను ఆదుకోవాలని జిల్లా వనరుల శాఖ మంత్రిని కోరారు. త్వరలోనే హంద్రీ నీవా ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు నీళ్లు నింపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.



## మృతి చెందిన రైతు కుటుంబ సభ్యులను పరామర్శించిన రైతు సంఘం నాయకులు

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** బనగానపల్లె మండల పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన రైతు ఎల్లా సుబ్బయ్య పొలంలో వ్యవసాయం చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మరణించారు. వారి కుటుంబ సభ్యులను ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు బేతంచెర్ల మండల నాయకులు బాలశేఖర్ సుబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో వారి కుటుంబం జీవనాధారం కూడా ప్రశ్నార్థకమైందన్నారు. వీరిలో ఇద్దరు అంగవైకల్యం కలిగిన పిల్లలు ఉండటంతో వారి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం రైతులను పట్టించుకోవాలని స్థానిక విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే రైతు చనిపోవడం జరిగిందని వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని లేని యెడల ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.


ఎల్లా సుబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దృశ్యం




## అనుమతి లేని టపాకాయలు స్వాధీనం

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** బనగానపల్లె పట్టణంలోని కొండాపేటకు చెందిన రాజా ప్రసాద్ వద్ద అనుమతి లేకుండా నిల్వ ఉంచిన టపాకాయలను బనగానపల్లె సి.ఐ క్రిష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. మెగా పవన్ కంపెనీకి చెందిన బాక్సు 1499కాగా ఇలాంటి 14 బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు వివిధ కంపెనీలకు చెందిన పలురకాల టపాసుల బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం వీటి విలువ 52000వేల రూపాయలు అని సి.ఐ తెలిపారు. టపాకాయలు వంటి పేలుడు పదార్థాలు అనుమతులు లేకుండా ఇండ్లలో నిల్వ ఉంచుకోరాదని నిల్వ ఉంచుకోవడం వలన ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి ప్రాణ, ఆస్థి నష్టాలు జరుగుతాయని అలాంటి వారిపై చట్టరిత్య కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.


మాట్లాడుతున్న సి.ఐ క్రిష్ణయ్య యాదవ్

# పోరాట స్ఫూర్తికి ప్రతిరూపం ఏపీటీఎఫ్

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి. హృదయ రాజు





**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భం మరియు విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహించడం శుభపరిణామమని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి. హృదయ రాజు అన్నారు.ఆదివారం రామకృష్ణ పిజి కళాశాల ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభ సమావేశం జిల్లా అధ్యక్షులు బి మాధవ స్వామి అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హృదయ రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం నాటినుండి నేటి వరకు స్ఫూర్తి గల సంఘంగా, ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాట సంస్థగా పని చేస్తుం దని అన్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఇటు ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం తోపాటు ప్రభుత్వ, విద్యా రంగ పరిరక్షణ కొరకు, సమాజ శ్రేయస్సు కొరకు,నిరంతరంపాటుపడడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధన చేస్తే పరిస్థితులు లేవని బోధనకు ఆటంకంగా ఉన్న అన్ని యాప్లను తొలగించాలని, మీడియం సిలబస్, పరీక్షల పైస్పష్టతఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అక్టోబర్ 6 7 8 తేదీలలో విజయనగరంలో జరిగే 80 వసంతాల వేడుకలు మరియు 20వ విద్రా వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలకు నంద్యాల జిల్లా నుండి ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు.శ్రీ రామకృష్ణ విద్యాసంస్థలఅధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ 80 సంవత్సరాల ఏ పి టి ఎఫ్ మహాసభల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని అందుకు తన కళాశాలలోని వేదిక ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు ఉపా ధ్యాయులు సమాజాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నారని, ఉపాధ్యాయులంటే తనకెంతో అభిమానమని అన్నారు. సమకాలీన సమస్యలపై ఉపాధ్యాయులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థుల అభివృద్ధికి తాను ఎప్పుడు ముందుంటానని ఆయన అన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎం మధుసూదన్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, సమాజము మధ్య సంబంధాల గురించి మాట్లాడారు ఉపాధ్యాయులు నిరంతరం శిక్షణ పొందాలని సమాజంలో ప్రజలతో మమేకం కావాలని అన్నారు ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మధ్యకాలంలో ఏపీటీఎఫ్ చేపట్టినటువంటి కార్యక్రమాల గురించి, సాధించిన విజయాల గురించి వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యులు టీవీ రామకృష్ణయ్య, రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులుకె. సాంబశివుడు, జిల్లా గౌరవ అధ్యక్షులు కె. శంకర్ పి ఈ టి అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల రవికుమార్, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ శివకుమార్, మాట్లాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లెల పుల్లయ్య, ఆవుల మునిస్వామి, లింగమయ్య,శేషయ్య, నగిరి వెంకటేశ్వర్లు, శేషయ్య ఎంఎస్ ఉమర్, అబ్దుల్ వహీద్ మానపాటి రవి, ఎం పవన్ కుమార్ మహబూబ్ బాషా, మద్దిలేటి ,రవిశంకర్ గోవింద నాయక్, మహిళా కార్యదర్శులు బేబీ రాణి, శివకుమారి సుచరిత, కవిత, ఈశ్వరమ్మ, లక్ష్మీ ప్రసన్న, శ్రీదేవి, శంసున్నిసా బేగం తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**గడివేముల,మేజర్ న్యూస్ :** మండలంలోని ఆర్లగడ్డ గ్రామానికి చెందిన నీలి రామచంద్రుడు (42) సంవత్సరాలు గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు నీలి రామచంద్రుడు జనసేన పార్టీకి చెందిన కార్యకర్త మరియు జనసేన పార్టీ సభ్యత్వం ఉన్నందువల్ల మృతుని కుటుంబానికి గడివేముల మండల బలిజ సంఘం నాయకుడు 45.000 రూపాయలు మరియు గడివేముల మండలం జనసేన పార్టీ నాయకులు 20.000 వేల రూపాయలను మొత్తం 65 వేల రూపాయల నగదును మృతుని కుటుంబానికి బలిజ సంఘం నాయకులు రంగస్వామి, వెంకటేశ్వర్లు, సతీష్, మద్దిలేటి, రమేష్, మల్లీ, రవి, మహేష్ మరియు గడివేముల మండల జనసేన నాయకులు ధరణి, చంద్రమోహన్, మహమ్మద్ రఫీ, నాగేశ్వర్ రెడ్డి, సతీష్, ఫారుక్, ప్రభాకర్, కిరణ్ ఆధ్వర్యంలో నగదును అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జనసేన పార్టీ నాయకులు ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి ఆదుకుంటుందని అన్నారు. 65 వేల నగదును మృతుడు కూతురు పేరుమీద బ్యాంకులో డిపాజిట్ చేయాలని మృతుని కుటుంబాన్ని కోరారు.

## పోస్ట్ గ్రాడ్యుయేట్‌లకు ప్రత్యేక పాఠ్యాంశాల రూపకల్పన

**ఎమ్మిగనూరు టౌన్,మేజర్ న్యూస్:** ప్రపంచానికి భవిష్యత్తు నాయకు లను దిద్దే లక్ష్యంలో భాగంగా గ్రాడ్యుయేట్స్.. ప్రొఫెషనల్ కోసం పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్మెంట్ ఫర్ యంగ్ లీడర్స్ పేరుతో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ పరిచయం చేస్తుందని డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెష్ గ్రాడ్యుయేట్లు.. కెరీర్ తొలిదశ ప్రొఫెషనల్ కోసమే మేనేజ్మెంట్ లో ‘ ప్రారంభించినట్లు చెప్పారు. 2001లో కార్యకలాపాలు ప్రారంభించిన నాటి నుండి మేనేజ్ మెంట్ విద్యలో సరికొత్త బెంచ్ మార్కులను నెలకొల్పడానికి, ప్రపంచ భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగానే అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. ఇందులో బిజినెస్ డిజైన్ ల్యాబ్, ఇన్నోవేషన్ ల్యాబ్ తో పాటు అనుభవ పూర్వక అభ్యా సాలు చేర్చి పాఠ్యాంశాలుగా రూపొందించబడ్డాయని తెలిపారు. ఇందులో విద్యార్థులు తప్పనిసరిగా రెండు నెలల వేసవి ఇంటర్న్ షిప్ పూర్తి చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి గల విద్యార్థులు విద్య అర్హతలు, అనుభవం వివరాలు, చెల్లుబాటు అయ్యే జిమాట్ (GMAT),గ్రే(GRE)లేదాCAT స్కోరు సమర్పించాల్సి ఉంటుంది. ఎంపికైన విద్యార్థులకు ప్రముఖ పరిశ్రమ అభ్యాసకులు, విద్యా వేత్తలు, పూర్వ విద్యార్థులతో కూడిన ప్యానెల్ ఇంటర్వ్యూ చేస్తుందని స్పష్టం చేశారు.అయితే మెరిట్ కం నీడ్ ప్రమాణాల ఆధారంగా 40–50 శాతం తరగతి ఆధారిత స్కాలర్ షిప్ లు ఇవ్వ బడతాయని తెలిపారు. మెరిట్ స్కాలర్ షిప్‌లు అర్హులైన అభ్య ర్థులకు 100 శాతం ట్యూషన్ మినహాయింపు అందించవచ్చు.మరింత సమాచారం కొరకు https://www.isb.edu/en/study-isb/post-graduate-programmes/pgpyl.html సంప్రదించాలని మదన్ పిల్లుట్ల సూచించారు.

# భవిష్యత్తులో మానవ మనుగడకు ముప్పు

**– డాక్టర్లు నిబద్ధతతో చికిత్స చేయాలి**
**– ఎపిఐఎస్ఎఆర్ ఛాంబర్ ఆఫ్ ప్రెసిడెంట్ డాక్టర్ వై.పద్మలత**

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** సమాజంలో భవిష్యత్ తరం మనుగడకు ప్రమాదం ఏర్పడబోతోందని, సంతానలేని సమస్యలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, అలాంటి వారిని గుర్తించి డాక్టర్లు నిబద్ధతో చికిత్స అందించాల్సిన అవసరం ఉందని ఎపిఐఎస్ఎఆర్ ఛాంబర్ ఆఫ్ ప్రెసిడెంట్ డాక్టర్ వై.పద్మలత అన్నారు. శనివారం నగరంలోని మౌర్య ఇన్‌లో ఆంధ్రప్రదేశ్ ఇండి యన్ సొసైటీఆఫ్అసిస్టెంట్‌రీప్రొడక్షన్ జనరల్ సెక్రటరీ ఆశాఅనిల్‌బక్సి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ విష్ణుప్రియ, సెక్రటరీ డాక్టర్ వై.ప్రమోదరె డ్డిల ఆధ్వర్యంలో 4వ రాష్ట్ర వర్క్ షాప్ కార్యక్రమం నిర్వహించారు. వర్క్‌షాప్‌కు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి డాక్టర్లు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.పద్మలతరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం 2017లో సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇలాంటి శిక్షణకు గతంలో అవకాశం లేదన్నారు. ప్రస్తుత పరిణామంలో కొత్త కొత్త మార్పులు జరుగుతున్నట్లు తెలి పారు. ఇందులో భాగంగా మాతృత్వ సంతానోత్పత్తి సెంటర్ సహకారంతో కర్నూలులో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్లు, ప్రజలకు సంతానోత్పత్తి సమస్యలపై అవగాహన కల్పించడమే ఈ వర్క్‌షాప్ లక్ష్యమన్నారు దేశంలో మొదటిసారిగా 1972లో టెస్ట్‌ట్యూబ్ బేబీ జననం జరిగిందన్నారు. నేటి సామాజిక ప్రభావం వల్ల వల్ల ఎందరో సంతానాన్ని కోల్పోతున్నారన్నారు. అలాంటి వారికి ఈ వర్క్‌షాప్ ఎంతో దోహద పడుతుందన్నారు. నేటికి సంతానంపై గ్రామీ ణ ప్రాంతాల్లో సరైన అవగాహన లేదన్నారు. ఇన్‌ఫర్టిలిటీ స్పెషలిస్ట్‌లు సరైన చికిత్స అందించడం వల్ల సమస్యల పరిష్కారమవుతుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో డాక్టర్లు భవాని, శిరీష, శరణ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ వై.పద్మలత

## నగర పాలక వినతుల స్వీకరణ

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:**
నగరంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలకు సంబంధించి ఏవైనా స్థానిక సమస్యలుంటే అర్జీలు ఇవ్వగలరని పేర్కొన్నారు. ఉదయం 10గటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

# ఏఐసీం సమావేశానికి పయనమైన మేయర్

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** మధ్యప్రదేశ్‌రాష్ట్రంలోని దివాస్ నగరంలో సోమవారం జరిగే అఖిల భారత మేయర్ల మండలి(ఏఐసీఎం) కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు నగర మేయర్ బి.వై.రామయ్య ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఏఐసీఎం జాతీయ అధ్యక్షురాలు మాధురీ అతుల్‌పటేల్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు హోదాలో మేయర్ బి.వై.రామయ్య పాల్గొనున్నారు. సమావేశంలో ఏఐసీఎం రాష్ట్రస్థాయి కమిటీల ఏర్పాట్లు, మేయర్లకు శిక్షణ తరగతులు, కార్యాలయ పునరుద్ధరణ వంటి 9అజెండాలతోపాటు ఇతర అంశాలపై చర్చించనున్నారు.

# సంక్షోభంలోనూ సంక్షేమం అందిస్తున్న ప్రభుత్వం ..ఎమ్మెల్యే జయసూర్య




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**పాములపాడు మేజర్ న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త పాలనతో రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొ ట్టుమిట్టాడుతుందని ఎమ్మెల్యే గిత్త జయసూర్యఅన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనేక సంక్షే మ ఫలాలను అందించి కేవలం వంద రోజులలోనే మంచి పేరు తెచ్చుకుందన్నారు. కూటమి పాలన వందరోజులు పూర్తయిన సం దర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీపీ సరోజినీ వర్జినియ,ఎంపీడీవో గోపికృష్ణ అధ్యక్ష తన ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జయ సూర్య మాట్లాడుతూ ఎన్నిక ల్లో ఇచ్చిన హామీల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి డీఎస్సీ ప్రకటన, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు ప్రారంభించినట్టు చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత పారదర్శక పాలన అందించి ప్రజా మన్ననలు పొందుతామన్నారు. ప్రభుత్వం వచ్చిన వంద రోజులకే ఇంకా ఏమి చేయలేదు అంటూ వైసీపీ ప్రభుత్వం బురద జల్లే కార్యక్రమం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు నందికొట్కూ రు నియోజవర్గంలో ని సాగునీటి ప్రాజెక్టులు ద్వారా వేల ఎకరాలు శశ్యామలం అయ్యాయని అది కూడా తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్మించినవేనని గుర్తు చేశారు ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దుచేసి రైతులను ఆదుకున్నామని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొని డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు వారికి ఐదు నుంచి పది లక్షల వరకు రుణాలు మం జూరు చేసేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అక్టోబర్ 1 నుంచి నాణ్యమైన మద్యం విధానాన్ని అమలులోకి తీసుకొస్తారన్నారు. విజయవాడను వరద ముంచెత్తిన సమయంలో 74 సంవత్సరాల వయస్సు గల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 15 రోజుల పా టు బస్సులోనే ఉండి వరద బాధితులకు భోజనం, నీళ్లు మాత్రలు వంటి వసతులు ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకున్నారన్నారు. మొక్కలను నాటారు ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అతికించి కరప త్రాలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ తహ సిల్దార్ సుభద్రమ్మ, ఏవో పనిశ్వర్ రెడ్డి, మండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, పాములపాడు సర్పంచ్ మేకల భాగ్యమ్మ, వేంపెంట సర్పంచ్ మాణిక్యమ,లింగాల సర్పంచ్ మల్లేశ్వర్ రెడ్డి, తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాద్,కూటమి నాయకులు రవీంద్రారెడ్డి, హరినాథ్, చల్లా దామోదర్ రెడ్డి, రెడ్డి,తిమ్మారెడ్డి,మధు కృష్ణ,రాయపాటి గోవిందు, కరీం భాషా,రాము, బండ్లమూరి వెంకటేశ్వరరావు,చంద్రశేఖర్, లక్ష్మీకాంతరెడ్డి, మోహన్ గౌడ్ ఆదిరెడ్డి,ఆఫీస్,పూసల కృష్ణ, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన వెల్దుర్తి 12వ వార్డుకు చెందిన శివ రామిరెడ్డి సెప్టెంబర్ తొమ్మిద వ తారీకున అనారో గ్యంతో మృతి చెందిన సంగతి పాఠకు లకు తెలిసిందే, పట్ట ణంలోని బాలుర జడ్పీహెచ్ఎస్ స్కూల్లో 1996 -1997 10వ తరగ తి చదువుకున్న బ్యాచ్ కీశే" శివరామి రెడ్డి కుటుంబ సభ్యు లకు సానుభూతి తెలియజేస్తూ చిన్ననాటి స్నేహితుడు మనలో ఒకడు దూరమైనాడని బాధ గా ఉన్న ఆ కుటుంబానికి అండగా ఉందామని స్నేహితులు అందరూ కలిసి రూ, 72, 000 రూపాయలను ఆర్థిక సహాయం ఆయన భార్యకు అందించినారు. ఈ కార్యక్రమంలో మాధవస్వామి, ఖాజా,నాగరాజు,చిరంజీవి, అయ్యస్వామి, రహంతుల్లా, వెంకటేష్ ,శేషు, చంద్రశేఖర్, శివకుమార్, రమణ, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశా ల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి సీనియర్ మెన్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు ఆదివారం ప్రారంభమయ్యా యి. ఈ పోటీలను పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీనివాసు లు ప్రారంభిం చారు. ఈ సం దర్భంగా జిల్లా హ్యాండ్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి యర్రగుంట్ల మహబూ బ్‌భాష మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సుమారు 40 మంది క్రీడాకారు లు ఈ పోటీలలో పాల్గొంటున్నారన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబ రచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 9,10 తేదిలలో చాగల మర్రిలో జరిగే 53 వ సీనియర్ మెన్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో నంద్యాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీం ద్రారెడ్డి, వ్యాయమ సంచాలకులు దాదాపీర్, షేక్షావలి, జిల్లా హ్యాండ్‌బాల్ అసోషియేషన్ సంయుక్త కార్యదర్శి కడ్డీ మహబూబ్‌భాష, క్రీడాకారులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు విరాళాల వెల్లువ




చెక్కును అందజేస్తున్న కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** ఇటీవల విజయవాడలో బుడమేరు వరద తాకిడికి గురై నిరాశ్రయులైన వారిని ఆదుకొనేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చి చెక్కుల రూపంలో భారీగా విరాళాలు అందజేస్తున్నా రు. ఆదివారం నంద్యాల కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సర్దార్, కరీముల్లా, ఇస్మాయిల్, లక్ష్మీనారాయణ, నాగయ్య ఆచా రిలు మంత్రి ఫరూక్‌కు రూ. 36,616ల చెక్కును అందజేశారు. పట్టణంలోని పరమే శ్వర హోండా షోరూం చైర్మన్ రాజశేఖర్ తనవంతు సహాయంగా రూ.లక్ష చెక్కును మంత్రి ఫరూక్‌కు అందజేశారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ వరదల వల్ల చాలామంది నిరుపేదలుగా మిగిలారని వారి కోసం మావంతు సహాయం అందజేస్తున్నా మని తెలిపారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ అందరూ ముందుకు వచ్చి తమవంతు సహా యం అందజేయడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న పరమేశ్వర హోండా షోరూం చైర్మన్ రాజశేఖర్

# టీటీడీ పవిత్రతను కాపాడండి




మాట్లాడుతున్న నగరూరు రాఘవేంద్ర

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** టీటీడీ పవిత్రతను అపవిత్రత చేయవద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర అన్నారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలే ఖరుల సమావేశంలో మాట్లాడారు. పందికొవ్వు, గొడ్డుకొవ్వు, చేపల నూనెతో ప్రసాదం తయారుచేయ డం బాధకరమన్నారు. పవిత్రమైన, నాణ్యమై. సరుకులతో ప్రసాదాన్ని తయారు చేయాలన్నారు. శ్రీవారి ప్రసాదాల నాణ్యత మెరుగుకు గట్టి చర్యలు తీసుకోవాల న్నారు. ప్రసాదం కలుషితం చేసినట్లు అయితే జాతీయ భద్రత చట్టం కింద చర్యలు తీసుకోవాల న్నారు. కోట్లాది మంది భక్తులు మనోభావాలను దెబ్బతీయవద్దన్నారు. ప్రసాదం కలుషితం చేసి నట్లు రుజువైతే జాతీయ భద్రత చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వేముల శివప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# మహానందీశ్వరుని సన్నిధిలో అన్నమాచార్య వంశస్తుల పూజలు



మహానంది క్షేత్రంలో తాళ్ళపాక కుటుంబీకులు

**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో తాళ్ళపాక అన్నమాచార్యుల 12వ తరం వంశస్తులైన హరినారాయణ ఆచార్యులు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఆదివారం క్షేత్రానికి వచ్చిన వీరికి ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామి వార్లకు అభిషేకార్చనలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరీ అమ్మవారిపై శ్రీ కోదండ రామస్వామి వార్లపై కీర్తనలు అలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయంలో సంకీర్తన కైంకర్య పరులుగా సేవలు అందిస్తున్నామన్నారు. సుప్రభాత సేవలో నాలుగు సంకీర్తనలు మధ్యాహ్నం స్వామివారికి నిత్య కళ్యాణ మహోత్సవంలో కన్యాదాతగా వ్యవహరిస్తూ ఉంటామన్నారు. అలాగే స్వామివారి రాత్రి పవళింపు సేవలో గానం చేస్తూ శ్రీవారి సేవలో తరిస్తున్నామన్నారు. ఇది వంశపారంపర్యంగా వస్తున్న కైంకర్యమని పేర్కొన్నారు.

# బీసీ, డీఎన్‌టీ హాస్టల్స్‌ను పునఃప్రారంభించాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** ఎత్తివేసిన బీసీ, డీఎన్‌టీ హాస్టల్స్‌ను పునఃప్రారంభించా లని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌బాబు, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యా ర్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌కుమార్, డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్రనాయు డు డిమాండ్ చేశారు. ఆదివారం నగరం లోని బీసీ భవన్‌లో బీఎస్ఎఫ్ జిల్లా అధ్య క్షుడు మహేష్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ, డీఎన్‌టీ హాస్టల్స్ భవనాలు సరిగ్గా లేవనే కారణంతో ఎలాంటి ముందుస్తు సూచనలు లేకుండా మే నెలలో వాటి మూసివే యడం దారుణమన్నారు. దీని వల్ల 600మంది విద్యార్థులకు ఆశ్రయం కోల్పోయారన్నారు. కావునా విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. కావునా వెంటనే హాస్టల్స్‌ను పునఃప్రారంభించాలన్నారు. లేని పక్షంలో ఉద్య మాలను ఉధృతం చేస్తామన్నారు. రాజేష్, మోహన్, సతీష్, శివ పాల్గొన్నారు.

# ఇంటర్ స్టేట్ కరాటే పోటీలలో డోన్ విద్యార్థుల ప్రతిభ..

**డోన్ ,మేజర్ న్యూస్:** కర్నూలు పట్టణంలోని పుష్పరాజు ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన ఆరవ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో డోన్ పట్టణానికి చెందిన రామ్స్ స్కూల్ ఆఫ్ కరాటే విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి వారి వారి విభాగాలలో పథకాలు సాధించారు. కటా విభాగంలో అశ్వద్ బంగారు, అనికే త్ సిల్వర్ పథకం, అసిఫా బంగారు పతకం నిఖిల్ సిల్వర్ పథకం భాను ప్రకాష్ బ్రాంచ్ పతకం,చరన్ దీప్ బంగారు పతకం, సాయి కీర్తన సిల్వర్ పథకం, జాహ్నవి సిల్వర్ పథకం, తన్వి రెడ్డి సిల్వర్ పథకం సాత్విక్ రెడ్డి సిల్వర్ పథకం రవళి కాంస్య పథకం బి. అశ్వ ద్ సిల్వర్ పథకం సాధించారు. కుమితి విభాగంలో ,సాత్వి రెడ్డి, భాను ప్రకాష్,సిల్వర్ పథకం, నిఖిల్, చరణ్ దీప్,తన్వి రెడ్డి కాంస్య పథకం సాధించారుశిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ రమణను, పథకా లు సాధించిన విద్యార్థులను ముఖ్య అతిథులు ప్రశంసా పత్రాలతో సత్కరించారు. టీ మేనేజర్ బాబా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# వనభోజనాలు విజయవంతం చేద్దాం..



**డోన్ రెడ్ల సంక్షేమ సంఘం..**

**డోన్ ,మేజర్ న్యూస్:** డోన్‌లో కార్తీక మాసంలో భక్తితో నిర్వహించే వనభోజనల కార్యక్రమం గురించి డోన్ పట్టణములో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు నందు రెడ్డి ఇంటి వద్ద ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ డోన్ నియోజక వర్గంలోని రెడ్డి సహోదరులు అందరు సహాయ సహకారాలు అందించాలి అని, రెడ్లు అందరు సంఘటితం కావాలి అని పిలుపునిచ్చారు. అలాగే రెడ్లు కష్టాలలో ఉన్న వారిని కూడా ఆపన్న హస్తం అందించే విధంగా ఎదగాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు హేమసుందర్ రెడ్డి, ఆర్.టి.సి కృష్ణ రెడ్డి, రామేశ్వరరెడ్డి, చంద్రహాస్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,దార ప్రతాప్ రెడ్డి,రామకృష్ణ రెడ్డి, హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి రూ.1.11లక్షలు విరాళం

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్:** కర్నూలు జిల్లా కరువ సంఘం ఆధ్వర్యంలో పెద్దపాడు సమీపంలో నిర్మిస్తున్న శ్రీ భీరలింగేశ్వరస్వామి ఆలయం నిర్మాణం కోసం నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన ఎంకె.రాజశేఖర్, ఎం.కె.హరీష్‌బాబు, ఎంకె.రఘునందన్‌లు ఆదివారం రూ.1,11,116ల చెక్కును కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకె.రంగస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాలసుంకన్న, గుడిసె శివన్న, తిరుపాల్, కొత్తపల్లె దేవేంద్ర, నగర ఉపాధ్యక్షుడు కె.రాజు, కె.వెంకటేశ్వర్లు, మద్దిలేటి పాల్గొన్నారు.

# నిరుపేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



పీర్ గైబుసా వలి దర్గాలో ప్రత్యేక ఫాతిహాలు చేస్తున్న టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు

**చాగలమర్రి , మేజర్ న్యూస్ :** నిరుపేదల సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యం అని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎం ఎస్ అన్సర్ భాష అన్నారు. ఆదివారం ఆయన రాష్ట్రంలోని ప్రజలు సుభిక్షంగా సుఖ సంతోషాలతో ఉండాలని పీర్ గైబుసా వలి దర్గాలో ప్రత్యేక ఫాతిహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మంచి పరిపాలన అంది స్తుందన్నారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందిస్తూ మంచి పేరు తెచ్చుకొని వారి మన్ననలు పొందుతుందన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాలనలో పార్టీలక తీతంగా సంక్షేమ పథకాలను అందిస్తూ నిరుపేదల హృదయాల్లో నిలిచారున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి అభివృద్ధి పనులు చేపట్టి రాష్ట్రంలోనే ఆళ్లగడ్డ నియోజకవ ర్గానికి మంచి గుర్తింపు తెచ్చా రన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలానికి 2.5 కోట్ల తో మారుమూల గ్రామాలలో సైతం అభివృద్ధి పనులు చేపడుతున్నా రన్నారు. వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముం దుకు సాగుతున్నామన్నారు. చాగలమర్రి మండలాన్ని భూమా అఖిలప్రియ సహకారంతో నందన వనంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి మాబు షరీఫ్, ముల్లా ఆలంశ గారి మౌలాలి, ముల్లా అజిముద్దీన్, జెట్టి నాగరాజు, ముల్లా గఫార్, కొలి మి షబ్బీర్, కొలిమి అష్రాఫ్, పాల్గొన్నారు.

# జిల్లా చదరంగం జట్టు ఎంపిక పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం

**నంద్యాలటౌన్,మేజర్ న్యూస్:** నంద్యాలజిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలోఆదివారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఓపెన్,15 సంవత్సరాలలోపు బాలికల నంద్యాల జిల్లా చదరంగం జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ట్రోఫీలు, పతకాలు అందజేశారు . ఈ కార్యక్రమంలో ఆంధ్ర చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి,జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి,ఉపాధ్యక్షులు రాజ చక్రవర్తి, కోశాధికారి శ్రీనిష్, టోర్నమెంట్ ఆర్బిటర్ నిర్వాహకురాలు సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ చదరంగం మెదడుకు పదును పెడుతుందని,ఈ క్రిడ వలన బాలలలో మానసిక వికాసం కలుగుతుందని,ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. చదరంగం క్రీడ విద్యార్థులలో గెలుపు ఓటములను స్వీకరించే మనస్తత్వం, ఓటమి చెందాక తిరిగి గెలవాలనే పట్టుదల పెంచే క్రీడ అన్నారు. నిరంతర సాధన ద్వారా చదరంగంలో మెలకువలను, నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు. రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఓపెన్ మరియు బాలికల జిల్లా చదరంగం జట్టు ఎంపిక పోటీలలో విజేతలుగా నిలిచిన వారు త్వరలో రాజమండ్రిలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



ఎంపికైన క్రీడాకారులతో జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి,నిర్వాహకులు

**జిల్లా జట్టుకు ఎంపికైన విజేతల వివరాలు:** బాలుర విభాగం లో ఆళ్లగడ్డకు చెందిన గడ్డం శెట్టి రోహన్ ప్రథమ స్థానంలో నిలువగా, నంద్యాలకు చెందిన శివ కార్తికేయ,సుమంత్,వెంకట ముకుల్ ఆనంద్ తదుపరి మూడు స్థానాలలో బహుమతులు సాధించారు. బాలికల విభాగంలో నిహారి శ్రీ వైష్ణవి ప్రథమ స్థానం, శాలిని ద్వితీయ స్థానం, హారిక తృతీయ స్థానం, అకల్కా నాలుగవ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు.

# గురురాజాలో ప్రోవాలీబాల్ టోర్నమెంట్ పోటీలు



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని ఎన్‌జిఓ కాలనీలో శ్రీగురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఇంట్రా స్కూల్ ప్రో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథులుగా గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరిరెడ్డి, టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, డాక్టర్ రవికృష్ణలు పాల్గొన్నారు. ఇంట్రా స్కూల్ వాలీబాల్-2024 అంతర్ పాఠశాల భాగంగా క్రీడాకారులను 14బృందాలుగా ఏర్పాటు చేసి వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. జాతీయ క్రీడా పతకాలు ఆవిష్కరించారు అనంతరం క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా చైర్మన్ దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న క్రీడా ప్రతిభా శక్తిని వెలికితీయాలన్న ఉద్దేశంతో విద్యార్థులను 14 బృందాలుగా ఏర్పాటు చేసి క్రీడా టోర్నమెంట్‌ను నిర్వహించినట్లు తెలిపారు విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలపట్ల ఆసక్తిని పెంచి వారిలో దాగివున్న శారీరక దారుఢ్య శక్తిని పెంపొందించాలని నాయకత్వ లక్షణాలను బాల్యదశలో మెరుగుపరుచుకోవడానికి ఈ క్రీడలు ఎంతో అవసరమని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు అతిథులు ట్రోఫీతో పాటు మెడల్స్‌ను అందజేసి వారి విజయాలు ప్రశంసించారు. ఈ క్రీడా పోటీలలో ఏపీ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏపీరెడ్డి, దండె నాగరాజు, దివాకర్, లింగమయ్య, బాలకృష్ణ, సాల్మన్‌రాజులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డిలు పాల్గొని బహుమతులు అందజేశారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్ఎండి ఫిరోజ్

# మంత్రి నిమ్మలరామానాయుడును కలిసిన ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్:**

కర్నూలు జిల్లాకు వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మలరామానాయుడును ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

హంద్రీ నీవా చెరువులకు నీళ్లు నింపాలన్నారు. అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టాలని మంత్రిని ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం- ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నిలిపేందుకు నా వంతు కృషి చేస్తానన్నారు. ముందుగా మండల కేంద్రానికి చేరుకోగానే కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి పూలమాలలతో ఘనస్వాగతం పలికారు, అనంతరం బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. మండలంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ప్రభుత్వాన్ని ప్రజలనుదేశించి మాట్లాడుతూ ఈ రాష్ట్రం అన్ని విధాలుగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై పూర్తి నమ్మకంతో విశ్వాసంతో అఖండ మెజార్టీతో గెలిపించిన మీ అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ రాబోయే 2029 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాని అన్ని విధాలుగా అభివృద్ధి చేయుటకు కంకణం కట్టుకున్నారన్నారు ఇటు వ్యవసాయం విద్య వైద్యం ఇండస్ట్రియల్ పచ్చదనం పరిశుభ్రత పర్యావరణం ఆర్థిక సాధికారత వంటి అంశాలపై ప్రణాళిక ఏర్పాటు చేశారన్నారు 100 రోజుల్లో పాలనలో మెగా డీఎస్సీ ద్వారా 16 వేల పైచిలుకు టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది, పింఛను 4000 కి పెంచి వికలాంగులకు 6000కు పెంచి ఇంటి పెద్ద కొడుకు బాధ్యతగా ఒకటో తారీకు పెన్షన్ అమౌంట్ అవ్వ తాతలకు వికలాంగులకు అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి దక్కుతుందని అన్నారు . పేదవాడి ఆకలి తీర్చడానికి ఐదు రూపాయలకే భోజనం అందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ఓపెన్ చేసి మూడు పూటలా ఆహారానందిస్తున్న ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుంది అకాలవరదల సమయంలో విజయవాడ నీట మునిగిన సందర్భంలో ఏడు రోజులు రాత్రనకా పగలనకా నీటిలోనే నడుస్తూ అక్కడే ఉంటూ ప్రజల యోగక్షేమాలు తెలుసుకునే వారికి కావాల్సిన నిత్యవసర సరుకులు అందిస్తూ విజయవాడకు మునుపటి రూపం కల్పించడానికి దివారాత్రములు కష్టపడిన ఘనత చంద్రబాబుకే దక్కింది ఇలా రాష్ట్రాన్ని ఆపద సమయంలో అన్ని విధాలుగా ఆదుకోవాలంటే అనుభవం కలిగిన నాయకుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమే అని తెలిపారు . మండలానికి ఆర్ఎంబి రోడ్డు చెరువుకు నీరు మండలం నుంచి గ్రామాలకు అనుసంధానమైన రోడ్లను త్వరలోనే పునరుద్ధరిస్తాం అని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ కార్యక్రమం లో భాగమైన స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 నాటికి ఈ దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి గతంలో నడిపించేందుకు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వ్యవసాయం, విద్య వైద్యం పారిశ్రామికం పచ్చదనం పరిశుభ్రత పరిరక్షణ పర్యావరణం ఇలా అన్ని రంగాలలో భారతదేశాన్ని ప్రపంచ దేశాలలో బలమైన దేశంగా చెప్పుకునే విధంగా మన ప్రధాని నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారు. ఇటు రాష్ట్రంలో నారాచంద్రబాబు నాయుడు ఈ రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ఆదుకొనుటకు కేంద్ర సహకారంతో ముందుకు వెళ్లేటప్పుడు అన్ని రకాల ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు త్వరలోనే ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో సంక్షేమ దిశగా పరుగులు పెట్టించడంలో మన ముఖ్యమంత్రి ఆలోచన విధానం అందుకు నిదర్శనం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు తహసిల్దార్ విజయశ్రీ ,మండల ప్రత్యేక అధికారి శ్యామల, మండల అభివృద్ధి అధికారి ఏసీ రాముడు ,మండల విస్తరణ అధికారి సందీప్, ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది, పశువైద్య సిబ్బంది,వివిధ శాఖల అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు ప్రజలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## ప్రజాసంక్షేమం లక్ష్యంగా టిడిపి కూటమి ప్రభుత్వం పని చేస్తోంది..



పెద్దకడుబూరు మేజర్ న్యూస్ : ప్రజా సంక్షేమం లక్ష్యంగా తెలుగుదేశం ప్రభుత్వకూటమి పని చేస్తోందని మంత్రాలయం నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ రాఘవేంద్రరెడ్డి. రాష్ట్ర టిడిపి తెలుగు రైతు విభాగం అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి. మంత్రాలయం నియోజక జన సేన పార్టీ ఇంచార్జ్ వాల్మీకి లక్ష్మన్న లు పేర్కొన్నారు. ఆదివారం పెద్దకడుబూరు మండల పరిధిలోని కంభళదిన్నే. కల్లుకుంట గ్రామాలలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం అనేకార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి. సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రం అభివృద్ధివైపు అడుగులు వేసేందుకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నాడని వారు తెలిపారు. వందరోజుల పరిపాలనలో వృద్ధులకు పింఛన్లురూ .4 వేలు.వికలాంగులకు రూ.26వేలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే కంభళదిన్నే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మాట్లాడుతూ మా గ్రామం లో తాగడానికి మంచి నీరులేక నీళ్లను కొనుగోలు చేసి తమగొంతులు తడుపు కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు నాయకులు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో నాయకులు మాట్లాడుతూ మీ గ్రామానికి తాగు. సాగునీరు అందించేందుకు తగుచర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. అలాగే టీడీపీ కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలువాలని వారుపిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ బసల దొడ్డి ఈరన్న మంత్రాలయం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ విష్ణు కుమార్‌రెడ్డి.నల్లమల విజయ్ కుమార్. మల్లికార్జున. మీసేవా అం జినయ్య. భీమరాయుడు. కంపాడు మునెప్ప. మల్లకల్. మాజీ ఎంపిటిసి వీరప్ప నాయుడు. తాయన్న, బోయమా రెన్న. నాగేంద్ర. తలారి అంజి. బోగ్గులనరసన్న కల్లుకుంట పురుషోత్తం గౌడు దాసప్పరెడ్డి. సంజీవయ్య. తాయన్న. మంచోదిరామన్న వివిధ గ్రామాల నుండి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కర్రల దాడిలో ఆరుగురిపై కేసు నమోదు



కర్రల దాడిలో గాయపడిన వ్యక్తి

జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని తూడిచెర్ల గ్రామంలో ఆదివారం ఎల్ల పుల్లయ్య, నవీన్ అనే వ్యక్తులపై అదే గ్రామానికి చెందిన ఆరుగురు కర్రలతో దాడి చేయడంతో ఆరుగురి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు తూడిచెర్ల గ్రామానికి చెందిన ఎల్ల పుల్లయ్య, ఇటుక శేఖర్ గౌడ్‌లు ఇద్దరూ కెసి కాల్వ నీరు నీటి కాల్వకు మళ్లించే విషయంపై ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఆదివారం ఎల్లపుల్లయ్య , నవీన్‌లు శేఖర్ గౌడ్ ఇంటి ముందు వెళ్తుండగా శేఖర్ గౌడ్ కల్పించుకొని వారిని తిట్టడంతో అనవసరంగా మమ్ములను తిట్టవద్దని చెప్పుండగానే శేఖర్ గౌడ్‌తోపాటు శంకర్ గౌడ్, నాగేంద్ర గౌడ్, వెంకటేష్ గౌడ్, మహేష్‌గౌడ్, ధనుంజయ గౌడ్‌లు కలసి కర్రలతో పై ఇరువురిని తీవ్రంగా గాయపరచారు. గాయపడిన వారిని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆర్థిక సంక్షోభంలోనూ ప్రజా సంక్షేమం అందించిన పార్టీ టీడీపీ

జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ : ఆర్థిక సంక్షోభం ఉన్నా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అందించి అండగా నిలిచిందని గ్రామ సర్పంచ్ పల్లె నిర్మలమ్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోతులపాడు గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ప్రభుత్వం వంద రోజుల పరిపాలన



కరపత్రాలను అందజేస్తున్న సర్పంచ్ నిర్మలమ్మ

గురించి ప్రజలకు వివరిస్తూ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేసేందుకు ఏర్పడ్డ ప్రభుత్వం ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వమని ప్రజలకు తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం వంద రోజులకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి తిరిగి ఆమె పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం ఎందుకంటే ఆర్థిక సంక్షోభంలోనూ ప్రజలకు అండగా నిలిచిందని, తెలుగుదేశం పార్టీ చంద్రన్న కూటమి ప్రభుత్వమేనని ఆమె అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న ఇంత మంది ప్రభుత్వమని ప్రజలచేత అనిపించుకుంటుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లె శివానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మంజుల పాల్గొన్నారు.

## మెడిసిన్ సీటు సాధించిన అవుకు విద్యార్థి



మిరియాల హరి పవన్ (ఫైల్‌ఫోటో)

అవుకుమేజర్,న్యూస్: అవుకు పట్టణానికి చెందిన మిరియాల హరి పవన్ మెడిసిన్ పీజీలో సీటు సాధించాడు. మిరియాల హరి పవన్ తల్లిదండ్రులు లక్ష్మీ సులోచన, రత్నమయ్యలు మాట్లాడుతూ అనంతపురం మెడికల్ కాలేజీలో వైద్య విద్యను పూర్తి చేసిన హరి పవన్ ఆగస్టులో జరిగిన మెడిసిన్ పీజీ ప్రవేశ పరీక్షను వ్రాయడం జరిగిందని అన్నారు. మెడిసిన్ పీజీ ఫలితాలలో ఆల్ ఇండియా 1676వ ర్యాంకు సాధించి, రాష్ట్రస్థాయిలో 69వ ర్యాంకు సాధించడం జరిగిందని అన్నారు. హరి పవన్ ప్రాథమిక విద్యను బనగానపల్లె పట్టణంలో నెహ్రూ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ విజయవాడ శ్రీ చైతన్య కాలేజీలో చదివాడని అన్నారు. పీజీలో జనరల్ మెడిసిన్ పూర్తి చేసి కార్డియాలజీగా సేవలు చేయాలని ఉందని హరి పవన్ అన్నారు.

# చదువే మనిషికి నిజమైన సంపద

- ప్రముఖ గుండె వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ క్రాంతి చైతన్య..
- నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పేద విద్యార్థుల కోసం ఉచిత ట్యూషన్ ఏర్పాటు..



నంద్యాల టౌన్ మేజర్ న్యూస్: చదువే మనిషికి నిజమైన సంపద అని ప్రముఖ గుండె వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ క్రాంతి చైతన్య అన్నారు.ఆదివారం పట్టణం లోని రైల్వే గుడ్ షెడ్స్ ఏరియా ఏ కే గోపాలన్ భవన్ లో అక్కడి పేద పిల్లలకు ఏర్పాటు చేసిన ఉచిత ట్యూషన్ సెంటర్‌ను ఇండస్ గుండె జబ్బుల ఆసుపత్రి నిర్వాహకులు ప్రముఖ కార్డియాలజీస్టు డా. క్రాంతి చైతన్య ముఖ్యతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా ప్రధానమైందని,పేద విద్యార్థుల కోసం నంది విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలోఉచిత ట్యూషన్ సెంటర్ ను ప్రారంభించడం అభినంద నీయమని, ఇలాంటివి మరిన్ని శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు చేయూత నివ్వాలని ఆయన నిర్వాహకులను కోరారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానన్నారు.పిల్లలలో జ్ఞానం వస్తుందంటేఅది చదువు ద్వారానే సాధ్యమన్నారు. మాజీ కౌన్సిలర్ బి. శంకరయ్య మాట్లాడుతూ... పిల్లల్లో విద్య పట్ల భయాన్ని దూరం చేస్తూ సృజనాత్మకతను వెలికి దీస్తూ వారికి పాఠశాలలో మిస్సయిన అంశాలను ఇక్కడ బోధించడం ఎంతో దోహదపడుతుంది కాబట్టి ఆర్థికంగా వెనుకబడినటు వంటి కుటుంబాల నుండి ఉన్నటువంటి విద్యార్థులకు ఈ బోధన కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నాము. కావున తమ పిల్లల చదివే ఆస్తిగా పిల్లల తల్లిదండ్రులు భావించాలి అందుకోసం పిల్లలను మరింత ఉన్నత చదువులు చదివేందుకు ఇటువంటి సేవా దృక్పథంతో ఏర్పాటు చేస్తున్నటువంటి ట్యూషన్ సెంటర్స్‌ని ప్రోత్సహించాలని వాటిని వినియోగించుకోవాలని కింది స్థాయి నుండే పేదరికం నుండే దేశాధినేతలు అనేకమంది ఎదిగారు దేశానికి సేవలు అందించారు. అనేకమంది ఇంజనీర్లు శాస్త్రవేత్తలు సైతం పేదరికంలో సైతం లెక్కచేయక చదివి ఉన్నత శిఖరాలకు చేరుకున్నటువంటి చరిత్ర మనం చూస్తూ ఉన్నాం కాబట్టి మట్టిలో మాణిక్యాలను వెలికిదీసేలా ఈ ట్యూషన్ సెంటర్స్ ను నిర్వహిస్తాము వీటిని ప్రోత్సహించడం ద్వారా మనందరికీ ఉపయోగపడతాది కాబట్టి తల్లిదండ్రులు అందరు కూడా మీ పిల్లలను కచ్చితంగా ట్యూషన్ సెంటర్‌కి పంపించి మీ పిల్లల అభివృద్ధిని కాంక్షించాలని మాట్లాడారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి నంది విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రామరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నంది విజ్ఞాన కేంద్రం నాయకులు జి. భాస్కర్, ఏ నాగేంద్ర ప్రసాద్ జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు గోపాల్, యూటీ ఎఫ్ నాయకులు రమణ, చిన్నయ్య ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి ఎం ఆర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు..
దశమి ఉత్సవాలు అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి



గోనెగండ్ల, మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన గోనెగండ్లలో వెలసిన శ్రీశ్రీశ్రీ ఆది చింతలమునిరంగడు, నల్లారెడ్డి స్వాముల వారి దశమి మహోత్సవాలు అన్నివర్గాల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మిగనూరు డిఎస్పి ఉపేంద్రబాబు అన్నారు. ఆదివారం గోనెగండ్ల లో ఎమ్మిగనూరు డిఎస్పి ఉపేంద్ర బాబు శ్రీశ్రీశ్రీ చింతలమని రంగడు నల్లారెడ్డి స్వాముల దేవాలయంలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీశ్రీశ్రీ ఆది చింతలముని నల్లారెడ్డి స్వాముల ఉత్సవాలలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశమి మహోత్సవాలకు వివిధ రాష్ట్రాలు, జిల్లాలు, పట్టణాలు, గ్రామాల నుంచి వస్తున్న వేలాది మంది భక్తులు, పిల్లలు, మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే దశమి ఉత్సవాల సందర్భంగా ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 70 మంది పోలీసులు మరియు మహిళ పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు. అలాగే దశమి ఉత్సవాలలో ట్రాఫిక్ కు అంత రాయం ఏర్పడకుండా వాహనాల పార్కింగ్ వద్ద బారికేడ్ల ఏర్పాటు తదితర అంశాల పట్ల తగుజాగ్రత్తలు పాటించాలని పోలీసులకు సూచించారు.దశమి మహోత్సవాల్లో బాల్ గేమ్స్, ఛాన్స్ గేమ్స్, పేకాట నిర్వహించినా, ఆడినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన,మద్యం సేవించిన, మద్యం సేవించి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు డి.ఎస్.పి ఉపేంద్రబాబును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ గంగాధర్, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలు,మేకలకు నిలయంగా ఎస్సీ బాలుర వసతి గృహాలు

హొళగుంద మండలాలలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం..
ఉన్న భవనాలను ఉపయోగించుకొని ప్రభుత్వం..
భవనాలు లేవంటూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు తరలింపుకు ప్రయత్నం..



హొర్దగేరిలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీబాలుర వసతి గృహం

హొళహర్వి, మేజర్ న్యూస్ : ఆలూరు నియోజకవర్గంలో ఎస్సీ బాలుర వసతి గృహాలు గొర్రెలు,మేకలకు నిలయంగా మారాయి.నియోజక వర్గంలో హొళహర్వి మండలంలోని హొర్దగేరి,హొళగుంద లలో నాటి టీడీపీ ప్రభుత్వం 2016లో 80 లక్షల తో నూతన భవనాలు నిర్మించారు. అయితే ఏడాది గడిచే సరికి విద్యార్థుల శాతం తక్కువగా ఉందని,నీటి సమస్యతో పాటు మండల కేంద్రాలకు దూరంగా నిర్మించడం తో విద్యార్థులు ఉండడానికి అయిష్టత చూపారు.దీంతో ఉన్న విద్యార్థులను గురుకుల ఇతర పాఠశాలలకు తరలించి కొత్తగా నిర్మించిన వాటిని వేరే అవసరాలకు ఉపయోగించకుండా నిర్వీర్యం చేశారు. కొత్త భవనాలను ఇతర ప్రభుత్వ భవనాలకు ఉపయోగించకుండా దానికి కాపలా ఉంచకుండా మూతవేశారు. అయితే ఆలూరులో ఉన్న గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలను భవనాలు లేవని తరలించడానికి ప్రయత్నాలు చేస్తున్న అధికారులు ఉన్న భవనాలలో ఇలాంటి పాఠశాలను ప్రారంభించవచ్చని ప్రజలు తెలిపారు. హొర్దగేరి లో నిర్మించిన బాలుర వసతి గృహం మండల కేంద్రానికి దూరంగా ఉండడం రవాణా సౌకర్యం లేకపోవడం కారణం కాగా హొళగుందలో పట్టణానికి కిలోమీటరు దూరంగా ఉండడంతో విద్యార్థులు ఉండడానికి అక్కడినుండి పాఠశాలకు రావడానికి విద్యార్థులు కష్టాలు పడతుండడంతో వసతి గృహాలపై విద్యార్థులకు అనాశక్తి ఏర్పడింది. దీంతో వసతి గృహాలను నిర్వీర్యం చేశారు. ఖాళీగా ఉన్న గృహాలను ఇతర గురుకుల పాఠశాలలపై లేక ఐటీఐ లాంటి పాఠశాలలను ఏర్పాటు చేస్తే అందరికి ఉపయోగం ఉంటుందని అంటున్నారు. కావున జిల్లా అధికారులు ప్రత్యేకమైన దృష్టి పెట్టి నిరుపయోగంగా ఉన్న బాలుర వసతి గృహాలను గొర్రెలకు,మేకలకు అడ్డాగా మార్చకుండా విద్యానిలయాలుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

వసతి గృహంలో మొలచిన కంప చెట్లు



## అక్టోబర్ 3 నుండి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ శరన్నవరాత్రి ఉత్సవాలు



**ఆళ్లగడ్డ , మేజర్ న్యూస్ :** పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిఆలయంలో ఈ ఏడాది దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు పేర్కొన్నారు.దసరా ఉత్సవాల నిర్వహణపై ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో వైవిధ్య భరితంగా దసరా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రొద్దుటూరు తర్వాత ఆళ్లగడ్డ పట్టణంలో కూడా ప్రతియటా పెద్ద ఎత్తున అమ్మవారి ఉత్సవాలను నిర్వహించడంజరుగుతుందని తెలిపారు.అక్టోబర్ నెల 3 వ తేది నుండి 13 వరకు పది రోజులపాటు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి శాలను రంగు రంగుల విద్యుత్తు దీపాలు, కటౌట్లచే ప్రత్యేకంగా అలంకరించి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు తెలిపారు. తమిళనాడులోని అంబూరు కు చెందిన సౌందర్య రాజన్ వారిచే ప్రతి నిత్యం అమ్మవారి నవరాత్రి అలంకరణలు,ఫ్లవర్ డెకరేషన్,ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. భక్తుల దర్శనార్థం క్యూలైన్లు, పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ ఉంటాయన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో ప్రత్యేక రోజులైన బిందే సేవ, తోటోత్సవము, దుర్గాష్టమి రోజున మహిషాసుర మర్ధిని అలంకారం, దశమి పండుగ రాత్రి గ్రామోత్సవం.. శ్రీ వాసవాంబ ఊరేగింపు ఉత్సవం, వసంతోత్సవము, పాన్పు సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ ఏడాది అమ్మవారి శాల ఆవరణలో తెప్పోత్సవం కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వేద పండితులచే నవగ్రహ జపాలు, ప్రత్యేక పూజలు, చండీ హెూమము, పూర్ణాహుతి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారి దర్శనం చేసుకోవాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు, మాజీ అధ్యక్షుడు తొమ్మండ్రు వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అమ్మవారి శాల కార్యనిర్వాహక అధ్యక్షులు టంగుటూరి ప్రసాదరావు, బైసాని రవి ప్రకాష్, ఉపాధ్యక్షులు గుండా నాగ ప్రదీప్, అల్వాల శివ చరణ్, ఉపాధ్యక్షులు పేరూరు విజయ్ కుమార్, నిచ్చెన మెట్ల రామయ్య, ప్రధాన కార్యదర్శిసూర్య గోవిందరాజులు, సహాయ కార్యదర్శులు పోలయ్య, లగిశెట్టి సుబ్రహ్మణ్యం, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, పువ్వాడ సురేంద్ర కుమార్, కోశాధికారి రేపాకుల శ్రీనివాసులు, పండుగ కమిటీ కార్యదర్శి నూకల ఉదయ్ కుమార్, కోశాధికారి బైసాని రవి ప్రకాష్, ఉప కోశాధికారి గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** పట్టణంలోని అవోపా కార్యాలయంలో ఆదివారం అవోపామహిళావిభాగ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్, థైరాయిడ్, బీపీ వ్యాధుల మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఆళ్లగడ్డకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఏవి రామ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సాయి ప్రణీష , మాక్లోడిస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు హాజరై రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను కూడా అందజేశారు. ఈ మెగా శిబిరానికి సుమారు 300 మంది పైగా రోగులు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం జీవన శైలిలో లోటుపాట్ల వల్ల ఎక్కువగా లైఫ్ స్టైల్ డిసీజెస్ వస్తున్నాయని ప్రారంభంలోనే వాటిని కనుక్కొని సరైన చికిత్స చేయించుకోవడం ద్వారా రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు.ఆళ్లగడ్డలో మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేసిన అవోపా మరియు మహిళా విభాగ్ వారికి డాక్టర్ ఏవి రామసుబ్రహ్మణ్యం, డాక్టర్ సాయి ప్రణీష కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు అవోపా సంఘ భవన నిర్మాణ నిధికి 25,116/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అవోపా సంఘ మహిళా విభాగ ప్రెసిడెంట్ సుజాత, సెక్రటరీ సునంద, కోశాధికారి కాత్యాయని, సభ్యులు లలితా, పద్మజవల్లి, శ్రీదేవి, విజయ, ఉమా, అంజనీ యశోద, నాగరత్న, భాగ్యలక్ష్మి, విజయ కుమారి అవోపా సంఘనాయకులు ప్రభాకర్,వెంకటసుబ్బయ్య, గోవిందరాజులు, సురేంద్ర మాల్కోడీస్ ఫార్మా ప్రతినిధులు శంకర్ ,సాయి, శివ పాల్గొన్నారు.

## మంచి పాలనకోసమే ప్రజలు టీడీపీని గెలిపించారు..

**సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడమే టీడీపీ ధ్యేయం..ఎంపి నాగరాజు,వీరభద్ర గౌడ్‌లు..**

**ఆలూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో అవినీతి పాలనకు స్వస్తి పలికి మంచి ప్రభుత్వం రావాలనే ప్రజలు రాష్ట్రంలో టీడీపీని గెలిపించారని రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయడమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని ఎంపీ బస్తిపాడు నాగరాజు,టిడిపి ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ లు అన్నారు.ఆదివారం ఆలూరు మండలంలోని పెద్ద హెూతూరు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాక్షస పాలనలో ప్రజలు విసిగిపోయారని అందుకే టీడీపీకి భారీ మెజారిటీ ఇచ్చారని అన్నారు.ఆలూరు నియోజకవర్గంలో వేదావతి,నగర డోన రిజర్వాయర్ల నిర్మాణానికి సహకారం అందిస్తామని అన్నారు.అనంతరం ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను ఇంటింటికి వెళ్లి అతికించారు.కార్యక్రమంలో మండల కన్వీనర్అశోక్ యాదవ్,సర్పంచ్ రామకృష్ణ,ఎంపిడిఓ అల్లా బకాష్,లక్ష్మన్న,ఎంపిటిసి చిన్నా యాదవ్,బీజేపీ నాయకులు బసవరాజు,హనుమేష్, ఉచ్చీరప్ప,నారాయణ లు పాల్గొన్నారు.



## విద్యాభివృద్ధితోనే ఉన్నత శిఖరాలు చేరుకోగలరు

**– ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డా. క్రాంతి చైతన్య**

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :**

విద్యార్థులు విద్యాభివృద్ధితోనే ఉన్నత శిఖరాలు చేరుకోగలరని నంద్యాల ప్రముఖ గుండె వ్యాధి వైద్య నిపుణులు డా. క్రాంతి చైతన్య పేర్కొన్నారు. నంద్యాల రైల్వేస్టేషన్ ఏరియాలో ఎకె గోపాలన్ భవనంలో నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ట్యూషన్ సెంటర్‌ను ఇండస్ గుండె జబ్బుల ఆసుపత్రి నిర్వాహకులు, ప్రముఖ కార్డియాలజిస్ట్ డా. క్రాంతి చైతన్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ఉచిత ట్యూషన్‌సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఆసరా ఇవ్వాలన్నారు. తమవంతు సహకారం అందిస్తామన్నారు. పిల్లల్లో జ్ఞానం పెంపొందించాలంటే అది చదువు ద్వారానే సాధ్యమవుతుందన్నారు. మాజీ కౌన్సిలర్ శంకరయ్య మాట్లాడుతూ పిల్లల్లో విద్య పట్ల భయాన్ని దూరం చేస్తూ సృజనాత్మకతను వెలికి తీస్తూ బోధించడం జరుగుతుందన్నారు. అందువల్ల ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ఈ బోధనా కేంద్రం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఉన్నత చదువులు చదివేందుకు సేవా దృక్పథంతో ఏర్పాటు చేసిన ఈ ట్యూషన్ సెంటర్‌ను ప్రోత్సహించి వినియోగించుకోవాలని ఆయన అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను కచ్చితంగా ట్యూషన్ సెంటర్‌కు పంపించి వారి అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో నంది విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రామరాజు, నాయకులు భాస్కర్, నాగేంద్ర ప్రసాద్, గోపాల్, యుటిఎఫ్ నాయకులు రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాయక్ తదితరులు పాల్గొన్నారు.




ఉచిత ట్యూషన్‌ను ప్రారంభిస్తున్న డా. క్రాంతి చైతన్య

## సంక్షోభంలోనూ ప్రజలకు సంక్షేమం..ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

**వంద రోజులు మంచి పాలనను ప్రజలకు చూపించాం**
**నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్**
**ఏపీని 2047 నాటికి అగ్రగామిగా నిలపాలన్నదే చంద్రబాబు లక్ష్యం ..**
**గ్రామంలో నెలకొన్న సమస్యలన్నింటిని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం ..**
**గత ఐదు సంవత్సరాల రాక్షస పాలనలో రాష్ట్రం వెనుకబడింది**

**ఓర్వకల్లు ,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ఉన్న సంక్షోభ పరిస్థితులను అధిగమించి కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందిస్తుందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు, ఆదివారం మండల పరిధిలోని కాల్వ గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మండల స్పెషల్ ఆఫీసర్ డ్వామా పిడి అమర్నాథ్‌రెడ్డి, హాజరయ్యారు.ముందుగా ఎమ్మెల్యేను నంద్యాల జిల్లా అధ్యక్షుడిని టిడిపి నాయకులు గజమాలతో సత్కరించారుఅనంతరం ఏర్పాటుచేసినప్రజావేదిక సభలో వారు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలోనే ఏపీని 2047 నాటికి ఏపీని అగ్రగామిగా నిలపాలని లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ సభను ఏర్పాటు చేయడం జరిగిందని దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎన్నికల ముందు ఐదు వాగ్దానాలను నెరవేర్చడం జరిగిందని అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ను పెంచి అందించడం జరిగిందని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత భారత్ లో భాగంగా అభివృద్ధి చెందిన ఏపీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో 2,047 విజన్ డాక్యుమెంటరీ రూపొందించడం కోసం ప్రజల నుంచి సూచనలు సలహాలు అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిందని దీంతో రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్లి వెనుకబడిందని అన్నారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట భూములను దోచుకోవాలని చూశారని చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుచేయడం జరిగింది అని వైసీపీ ప్రభుత్వంలో పెన్షన్ 2000 నుంచి 3000 చేయడానికి ఐదు సంవత్సరాలు పట్టిందని అర్హులైన వారికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం సముఖంగా ఉందని దీపావళి కానుకగా మహిళలకు 3ఉచిత సిలిండర్లను అమలు చేయడం జరుగుతుందని గ్రామాల్లో సర్పంచ్ల నిధులను గత ప్రభుత్వం ఖాళీ చేసి వారిని ఉత్సవమూర్తులుగా చేశారని సర్పంచ్లు ఆవేదన చెందారని చంద్రబాబు నాయుడు 15త్ ఫైనాన్స్ ద్వారా సర్పంచులకు నిధులను ఇచ్చి గ్రామాలను అభివృద్ధి చేయడానికి ముందున్నారని అన్నారు. ఓర్వకల్లు మండలాన్ని ఇండస్ట్రియల్ హబ్బుగా 2014 19లోనే చంద్రబాబు నాయుడు ప్రకటించి అభివృద్ధి చేయడం జరిగిందని డిఆర్డిఏ సోలార్‌వంటి పరిశ్రమలను తీసుకొని రావడం జరిగిందని అన్నారు.అనంతరం గ్రామ ప్రజలు గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు కొమ్ము చెరువుకు నీరు నింపాలని ఫ్యాక్టరీల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి పట్టాలకు లేఅవుటువేసి గృహాలు మంజూరు చేయాలని గ్రామంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని త్రాగునీరు సమస్య ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు. అందుకు స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం స్టిక్కర్ను ప్రజల ఇంటి వద్దకు వెళ్లి వివరిస్తూ వారి ఇంటికి అతికించారు అభిప్రాయాలను సూచనల కోసం బార్కోడ్ ద్వారా తెలియజేయాలని అన్నారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వెంకట రమణ ఎంపీడీవో శివ నాగ ప్రసాద్ హౌసింగ్ ఏఈ రామయ్య వ్యవసాయ అధికారి సుధాకర్ పంచాయతీ రాజ్ ఏఈ రామ సుబ్బారెడ్డి మండల కన్వీనర్ గోవిందరెడ్డి టిడిపి మండల నాయకులు మహబూబ్ బాషా విశ్వేశ్వర్ రెడ్డి పాలకొల్లు సుధాకర్ రెడ్డి బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి కనమడకల సుధాకరయ్యా తెలుగు యువత అధ్యక్షులు రాము మధు అడ్వకేట్ నాగ ముని చింతల పల్లి వెంకట రమణ నన్నూరు సర్కార్ పూడిచెర్ల సూరరాజన్న గ్రామ నాయకులు ఖాదర్ భాష రజాక్ బాషా శాలు భాష అజ్మతుల్లా సమీర్ అలిమ్ పయాజ్ షైక్షావలి మహమ్మద్ హుస్సేన్ మహమ్మద్ హుస్సేన్ తాజు భాష బక్షుమియా అంగడి సుల్తాన్ మహమ్మద్ సుల్తాన్ డేవిడ్ నాగేశ్వరరావు పంచాయతీ సెక్రటరీలు సచివాలయ సిబ్బంది ,ఆశావర్కర్లు,ప్రజలు పాల్గొన్నారు.






# వంద రోజుల పాలనలో అభివృద్ధికి బాటలు- మంత్రి ఫరూక్



ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండి ఫరూక్



స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నంద్యాలలోని 2వ వార్డు చింతరుగు వద్ద నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, కలెక్టర్ రాజకుమారిలు హాజరై ప్రారంభించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పట్టణాలు, గ్రామీణ వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం వాటిని బలోపేతం చేసి అభివృద్ధికి బాటలు వేస్తున్నదని తెలిపారు. వందరోజుల పాలన దిగ్విజయంగా ముగించుకుని అభివృద్ధి వైపు ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు మాత్రమే ప్రభుత్వం చేపడుతుందని స్పష్టం చేశారు. ప్రజల లోకి వెళ్లాలి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. అన్ని పట్టణాల్లో గ్రామాలలో కార్యక్రమాలు వారం రోజుల పాటు జరుగుతాయన్నారు. అధికారంలోకి రాగానే పింఛన్ సొమ్ము రూ. 3వేల నుంచి రూ. 4వేలు , దివ్యాంగులకు రూ. 6వేలు ఇవ్వడం జరిగిందన్నారు. 16,437 డిఎస్సీ పోస్టులు, అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద రహదారులు, మురికికాలువలు నిర్మిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులలో ప్రజలకు సుపరిపాలన అందిస్తుందన్నారు. సంకల్పం, చిత్తశుద్ధితో అతి తక్కువ కాలంలోనే అనేక విజయాలు సాధిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మెగా డిఎస్సీ విడుదల చేయడం పింఛన్లను ప్రభుత్వం సమర్థవంతంగా పంపిణీ చేసిందన్నారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా యంత్రాంగం పరిపాలనలో నిమగ్నమైందన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, కమిషనర్ నిరంజన్‌రెడ్డి, టీడీపీ కౌన్సిలర్ నాగార్జున, టీడీపీ ఇన్‌చార్జి జాకీర్, పట్టణ అధ్యక్షులు మునియార్ ఖలీల్, హరి తదితరులు పాల్గొన్నారు.

# ఆటలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుంది



క్రీడాకారులను అభినందిస్తున్న టీజీ వెంకటేష్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** ఆటలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. తైక్వాండోలో బ్లాక్‌బెల్ట్ సాధించిన క్రీడాకారులు ఆదివారం టీజీ వెంకటేష్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ అకాడమీలో రోజు విద్యార్థిని, విద్యార్థులు తైక్వాండో సాధన చేర్పిస్తున్న మాస్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మాస్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తైక్వాండో విద్యార్థులు బ్లాక్ బెల్ట్ సాధించడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో శిక్షకుడు, క్రీడాకారులు చిరుచరణ్‌తేజ్, విశ్వాసరావు పాల్గొన్నారు.

# వంద రోజుల్లోనే రాష్ట్ర అభివృద్ధికి అడుగులు

**– కొమ్మెమర్రి అభివృద్ధికి అడ్డంకిగా మారితే ఎవరిని ఉపేక్షించం..**
**– డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి**



కొమ్మెమర్రి సభలో మాట్లాడుతున్న కోట్ల

**ప్యాపిలి, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రాష్ట్ర అభివృద్ధి వైపు అడుగులు వేశారని డోన్ నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డిపేర్కొన్నారు. మండలంలోని కొమ్మెమర్రి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆదివారం అయిన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు పింఛన్ పెంచి లబ్ధిదారులకు అందజేశామన్నారు. దీపావళికి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో అభివృద్ధిని అడ్డుకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం రాచర్ల గ్రామంలోని బీసీ బాలూర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ భారతి, ఎంపీడీవో పజిల్ రహిమాన్, పి.ఆర్. ఎ. ఇ, ప్రభాకరరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, ఆర్ఈ నాగరాజు, గండికోట రామసుబ్బయ్య,గొల్ల రాంమోహన్ యాదవ్,మెట్టుపల్లి సుదర్శన్, కొమ్మెమర్రి వెంకటరాముడు, రమేష్, అలెబాద్ పరమేష్,వడ్డే మహారాజ్, మాధవరం స్వామి, రాచెర్ల రజిని యాదవ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల బాగోగులు చూసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే..

**– మార్కెట్ యార్డులో భోజనం క్యాంటిన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ**



**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** రైతులు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు.ఆదివారం అయన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రూ. 15 కే భోజనం చేసే క్యాంటీన్ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల బాగోగులు చూసే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. యార్డుకు సరుకు తీసుకుని వచ్చే రైతులు భోజనం కోసం ఇబ్బందులు పడుతున్నారని, తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. భోజన పథకం సక్రమంగా అమలు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో మార్కెట్ యార్డు కార్యదర్శి పద్మావతి, ఇస్కాన్ సభ్యులు, టిడిపినాయకులు, పార్టీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# భగవద్గీత ప్రపంచ సాహిత్యంలో సాటిలేని మేటీ గ్రంథం

**– రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్**



భగవద్గీతను అందజేస్తున్న దృశ్యం

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్:** భగవద్గీత సృష్టిలో అత్యంత ఉన్నతమైన గ్రంథమని, మన దేశ గొప్పతనాన్ని నా దేశం, భగవద్గీత, నా దేశం అగ్నిపునీత సీత, నాదేశం కరుణాతరంగ అని ప్రపంచ దేశాల్లో ప్రతి భారతీయుడు ఎలుగెత్తి చాటుటకు గర్వకారణమైన గ్రంథం అని, అటు వంటి గ్రంథాన్ని విద్యార్థులకు చిన్న వయసులోనే తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఇండస్ మాంటిస్సోరి విద్యాసంస్థల్లో మానవులందరికీ భగవద్గీత పుస్తకావిష్కరణ చేసి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం, సదాచారం కూడా నేర్చుకోవాలన్నారు. మాకు విద్యను అందించిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువకూడదన్నారు. అనంతరం భగవద్గీత పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రామశంకర్‌నాయక్, పూజారి మోక్షేశ్వరుడు, ఇండస్ మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కెఎన్‌వి. రాజశేఖర్, బిఎం.మీనాక్షి, విల్సన్‌అగస్టీన్, శ్రీనివాసులురెడ్డి, కామేశ్వరి, మధుసూదన్, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డివి.రమణ, ధర్మ ప్రచార మండలి సభ్యులు ఎద్దుల మహేశ్వరరెడ్డి, మారం నాగరాజు గుప్తా, ఆవోపా చీఫ్ మలిపెద్ది నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపికి సంబంధించి బకాయిలు క్లియర్ చేయండి



స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అందజేస్తున్న ఎంపి డా. శబరి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ఏపికి సంబంధించిన బకాయిలను క్లియర్ చేయండని హోంశాఖ సెక్రటరీని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటి ఫ్లోర్ లీడర్ డా. బైరెడ్డి శబరి కోరారు. ఢిల్లీలో కేంద్ర హోంశాఖ సెక్రటరీ గోవింద మోహన్‌ను ఆమె కలసి మాట్లాడారు. ఆదివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లిఖార్జునస్వామి వార్ల లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి ఏపికి సంబంధించిన బకాయిలను క్లియర్ చే సి సహకరించాలని కోరారు.

# నేడు అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:**

నగరంలోని పునరుద్ధరించిన రెండు అన్న క్యాంటీన్లను సోమ వారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించనున్నారు. ఉదయం 9గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని అన్న క్యాంటీన్, కొండారెడ్డి బురుజు సమీపంలోని అన్న క్యాంటీన్లను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష, జేసీ బి.నవ్య, నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబుతో కలిసి ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు.

# ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలి



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ మద్యం షాపుల కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీలకు కూడా కేటాయించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జటోతుహుసేన్‌నాయక్‌ను కోరారు. ఆదివారం కర్నూలు నగర పర్యటనకు వచ్చిన ఆయనను ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లుగీత కార్మికులకు పదిశాతం మద్యంషాపులు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఎస్సీ, ఎస్టీ పట్ల కూడా సానుకూలంగా నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి మార్గం చూపితే సారా, గంజాయి వంటి సామాజిక రుగ్మతలకు జోలికి పోకుండా గౌరవంగా జీవనం సాగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు రామరాజు, వెంకటేష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ప్రశాంత్, విజయ్ పాల్గొన్నారు.